# చనుబాలు

చీకటి చిక్కబడింది.

బలహీనంగా వెలిగే వీధిలైట్ల కాంతిలో వేపచెట్టు కింది అరుగుమీద మరింత దట్టమైన చీకట్లో నా చుట్టూ ఐదారు బీడీ ముక్కలు మినుకు మినుకుమంటున్నాయి.

వాటి నిప్పు వెలుగు అరుగుముందు నిల్చున్న నాలుగైదు జతల కనుపాపల మీద ప్రతిఫలిస్తోంది.

"మాదా కవలం తల్లీ! సందాకవలమమ్మా!" అంటూ బిక్షగత్తెలు ఇల్లిల్లూ తిరిగి గొంతెత్తే వేడికోళ్ళు ఇక్కడిదాకా పాకుతున్నాయి.

తెగులు చూపిన కోళ్ళను అగ్గవగా ఎదరక పోతున్న బేరగాళ్ళు వాటి కాళ్ళకు తాళ్ళు గట్టి సైకిలు మీద వేలాడేసుకు వెల్తోంటే - అవి అరిచే అరుపులు వీధంతా ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఇంగరారాదబ్బీ! పొద్దుబోలే?" ఎదురుగా పంచలోంచి మా అమ్మ పిలుపు.

"ఆ... వస్తాండలే..." చెప్పాను.

"ఏం ఏసేబూ! మీరు మీరు ఏదోకటి మాట్లాడుకొని చెప్పండి మరి." అరుగు ముందు నిల్చొని వున్న కొత్త మాలోల్ల నాయకుని కేసి చూస్తూ అన్నాను.

"అట్టనేబ్బా! అందరం కల్సి మాట్లాడుకొని ఎట్టనోకట్ట సద్దుకొంటంలేమరి. ఏమ్మాట పొద్దున్నే వచ్చి నీతో సెపుతంలే రెడ్డే!.. వస్చంసోమీ." అంటూ మెల్లగా అక్కణ్ణించి కదిలాడు ఏసేబు. అతనితోటి మిగిలిన మాలలు కూడా అనుసరించారు. వాళ్ళటు వెళ్ళగానే అంతవరకు జరిగిన చర్చమీద మా వాళ్ళు సమీక్ష మొదలెట్టారు.

"యీ మాలోల్ల పనే బాగుంది. అందరికీ మిద్దెలొస్చాండయి. తిన్నే తినకున్నే సల్లగా పడుండొచ్చు. మనమే... గుడిసెకు ఎక్కవా, కొట్టానికి తక్కవా అయి సచ్చేది." వేళ్ళు చురక్కిమనేదాకా కాల్చిన బీడీముక్కను విసరేస్తూ అన్నాడు గురన్న.

"గవర్నమెంటు ఇస్తాంది. వాల్లు తీసుకుంటాంద్రు మామా!" చెప్పాను.

"ఏం గవన్మెంటబ్బీ! ఓట్లకు అమ్ముడుబొయ్యేది." కేకరించి ఉమ్మాడు పులి సుబ్బన్న. "వాల్లకన్నా హీనంగా బతికెటోల్లు మనోల్లలో లేరంటావా. యేటా దోవదప్పకుండా వచ్చే యీ కరువుల్తో నెత్తినిండా అప్పుల మోత ఎక్కవై మన బతుకులు రోజురోజుకూ యిగిరిపోతాండయి. వాల్లకేం కూలి మారాజులు. రొంద్రూపాల బియ్యమొచ్చినాకె ఒక్కరోజు కూలికిబోతే సాలు మూర్రోజులు గోడకింద కూకున్నే జరిగిపోద్ది. వాల్లకంటే మనబతుకులేద

బాగుండాయబ్బీ! - యీ గవర్మెంటోల్లకు బుద్ధి లేదు గాని" అన్నాడు - ఆవేదనతోటి ఆవేశం మిళితమైన స్వరంతో.

"నిజమే నిజమే. సుగంగా బతకాలంటే యిట్టా కూలికెన్నా బోవాల. అట్టా వుజ్జోగమన్నా సూసుకోవాల." పక్కనే ఉన్న ఎంగన్న అందుకొన్నాడు.

"ఏమన్నాగానీ, మనకన్నా వాల్లే బాగా బతుకుతాన్రు." సిద్దయ్య సిద్ధాంతీకరించాడు.

"మనమెంత యీనంగా బతికినా అదో అట్టా బొచ్చెదీస్కోని యిండ్లమ్మటి బోలేం గదా!" రంగన్న అనటంతో అందరి కళ్ళూ అటుకేసి తిరిగాయి.

సత్తు పళ్ళేన్ని చంకనబెట్టుకొని వీధిలైటు వెలుగులో పై వీధికెల్తూ కన్పించింది మాల పొట్టక్క.

"యాడికో యీదెక్కి పోతాంది. వూరంతా దిరిగినా పెసిడెంటు ఇంటికాన్నే గాదూ దానికింత పిడ్సబుట్టేది" గురన్న అన్నాడు.

"యీల్లింటికి దానికి అంత లంకె వుంది మరి. యీల్లమ్మ తన పాలి మిగిలిచ్చెయినా ఆ పొట్టదానికి పెడ్తది."

నాకు వినబుద్ధిగా లేదు.

ఆ సంభాషణ పొడగింపు భరించరానిదిగా ఉంది.

వాళ్ళ మాటల్లో దాగున్న వ్యంగ్యం నాలో తగలరాని చోట తగిలి చురక్కిమనిపిస్తోంది.

ప్రెసిడెంటును అయినంత మాత్రాన నేను వాళ్ళ ఎగతాళికి అందనంత ఎత్తులో ఏమీ లేను. నిన్న మొన్నటి దాకా నిరుద్యోగిగా ఉండి యీ రోజు ప్రెసిడెంటు అయిన వాణ్ణి.

నేనూ వాళ్ళల్లో ఒకణ్ణే.

కాదంటే - నా తండ్రి అహోరాత్రుల శ్రమ ఫలంగా అంతో యింతో వాళ్ళకన్నా మంచి ఆర్థిక స్థితి కలవాణ్ణి.

వరసైన వాళ్ళ ఎగతాళి భరించటం బరువే.

అందులోనూ పొట్టక్కతోటి మా కుటుంబానికున్న సంబంధాన్ని గురించిన ఎగతాళికి నేనసలు తట్టుకోలేను.

చిన్నప్పటిలా బహిరంగంగా గేలిచేయకున్నా, నర్మగర్భంగా వాళ్ళు చేసే ఎగతాళి నా మర్మాల్లో నాటుకొంటోంది.

అక్కడికీ నేను హుందాగా ప్రవర్తించటంతో అంతగా పేలటం లేదు.

పొట్టక్క సంగతిని దాటవేసేందుకు రాబోయే ఎం.పి. ఎలక్షన్ల సవాలెత్తాను.

దాని మీద చర్చచాలా సేపు సాగింది.

అంతలో పొట్టక్క వూరంతా చుట్టి మాయింటి వద్దకు రావటం, ఆమె కోసమే కనిపెట్టుకున్నట్లు మా అమ్మ పప్పు బువ్వ పళ్ళెంలో వేయటం, పొట్టక్క పంచదిగి అరుగు ముందు నించే వెళ్ళటం జరిగింది.

"నేన్జెప్పలే..." గురన్న మళ్ళీ ఎత్తబోతున్నాడు ఆ విషయం.

"ఏమబ్బీ! ఇంగరా నాయనా" మా అమ్మ పిలుపు.

నాక్కొంత వూపిరి పీల్చుకున్నట్లయింది.

"బువ్వ దిని రాపోండి" చెప్పాను అరుగుదిగుతూ, చర్చ కొనసాగకుండా ఆపుతూ.

పై పంచెలు దులుపుకొంటూ నాతోబాటు కొందరు కదిలారు.

మెల్లిగా ఇంట్లోకెళ్ళాను.

అమ్మమీద అసహనంగా ఉంది.

భార్యమీద కోపంగా ఉంది.

మౌనంగా స్నానం చేసి భోజనం అయిందనిపించాను.

తల్లితో చెబితే ఉపయోగం కన్పించేట్టు లేదు.

అసలు - నాదొక సమస్యగా ఆమె అర్థం చేసికొనేట్లు చిత్రించలేనేమోనని నా అనుమానం.

నాకు మాత్రం ఇదొక సమస్యగా యీ మధ్య కాలంలోనే గదా విస్తృతమైంది.

రెండు మూడుసార్లు ఇందిరకు సూచాయగా చెప్పి చూశాను.

దీన్నంత తీవ్రమైన సమస్యగా ఆమె తీసికొన్నట్టు లేదు.

అందుకే ఆమె మీద కోపం.

లేచి అలవాటుగా అరుగు వద్ద కెల్తోంటే మంచమ్మీంచి నాన్న అన్నాడు. "రావ్వొంత సేపు పురాణం సదివి చెబితే మబ్బీ!- ఆ పోలుబొందులేని మాటల్తో పొద్దుబుచ్చుకుంటే" అని.

నేను విన్పించుకోనట్టుగా వెళ్ళి అరుగుమీద కూచున్నాను.

పంచాయితీ ప్రెసిడెంటును అయింతర్వాత రాత్రి పొద్దుబోయిందాకా అరుగు మీద యవ్వారం తప్పనిసరి బాధ్యత అయింది.

రాత్రి చర్చ సొంతం మాలోల్లకు రాబోతున్న బిల్డింగుల గురించే సాగింది.

వాళ్ళతో బాటు తమకు కూడా బిల్డింగులొచ్చే అవకాశమేదైనా వుందేమోనని రైతుల వెదుకులాట.

తమకు బిల్డింగులొచ్చే అవకాశం లేదని తెలిసేసరికి మాలోల్ల మీద కొంత ఈర్ష్య లాంటిది వ్యక్తం చేశారు ఒకరిద్దరు రైతులు.

యవ్వారం ముగించి ఇంట్లోకెళ్ళి మంచినీళ్ళు తాగి దొడ్లోకి నడిచేసరికి మంచమ్మీద కనుగూరికి వుంది ఇందిర.

నాస్పర్శ సోకగానే మెల్లిగా ఒక పక్కకు సర్దుకొంది.

"ఏం యవ్వారమబ్బా! సగిరబొద్దుదాకా. నాకీ దొడ్లో ఒక్కదాన్ని పండుకోవాలంటే ఎట్లనో వుంటది. బెన్నే వస్తేనేం?" అంది.

ఇప్పటి దాకా నిద్రబట్టలేదు కాబోలు.

నేను వెల్లకిలా పడుకొని మౌనంగా నక్షత్రాలకేసి చూస్తున్నాను.

ఆమెను మందలించేందుకు లోలోపల అసహనపడుతున్నాను.

పొట్టక్కను గురించి హెచ్చరించేందుకు ఆవేశపడుతున్నాను.

ఆమె చేయి మెల్లగా నా ఎదలమీద కొచ్చింది.

దానితోటే తల కూడా వచ్చి కుదురుగా సర్దుకొంది.

నేనా అనుభూతికి ఓవైపు బలంగా ఆకర్షింపబడుతోన్నా, రాయిలా వుండేందుకు విశ్వ ప్రయత్నం చేయసాగాను.

కొద్ది క్షణాల్లో పూర్తిగా కరిగిపోవటం ఖాయమనే సంగతి అర్థమై వెంటనే నోరు విప్పాను.

"రేపట్నుంచి ఆ పొట్టక్కను ఇంటికాడికి రానీగాకండ్రి" చెప్పాను.

మోచేతుల్ని ఆపుగా నా ఎదల మీద తలపైకి లేపింది ఇందిర.

"అదేం కూలికి నాలికి వచ్చేదా? కావిలి గంతలుండేదా? రోజూ కూడు బెట్టి సాకుతాండ్రు." కోపంగా అన్నాను.

ఆమె కళ్ళలోని ఆశ్చర్యం నా కళ్ళమీద తళుక్కున మెరిసింది. పొట్టక్కను అట్లా సంబోధించటం నాలోసైతం ఓ మూల అపరాధ భావంగా రగులుతోంది.

ఆమె మీది అసహనాన్ని నా నాలుక అంతకన్నా సున్నితంగా వెళ్లగక్కలేకపోయింది మరి.

"మా అమ్మకు నువ్వయినా చెప్పి ఆమెపీడ ఎట్లనో కట్ల వదిలించు" చెప్పాను.

ఉపోద్ఘాతం అర్థంకాని విద్యార్థినిలా నాకేసి చూసింది ఇందిర.

"మన పెళ్ళయిన కొత్తలో నువ్వే సెబితివి పొట్టక్కను రొవ్వొంత బాగా సూసుకోమని. ఇంటికాడికొస్తే లేదనకుండా పంపమని?" ప్రశ్నార్థకంగా ఆగింది.

సమాధానం కోసం చాలాసేపు నేను గుండె తడువుకోవలసి వచ్చింది. అంతలో ఆమె తల నా ఎదమీద సున్నితంగా వాలింది.

* * * *

చిన్నంబలి పొద్దయింది.

నోట్లో వేప పుల్ల ఆడిస్తూ తోట వద్దనించి తిరిగి వస్తున్నాను. జ్యోతి వాగులో దిగేసరికి ఏసేబు ఎదురయ్యాడు. "నీ కోసమే వస్చాంద సోమీ!" అంటూ.

"మాట్లాడుకొన్నెరా?" అడిగాను.

"కుదర్లేదయ్యా!" వెనకే నడుస్తూ చెప్పాడు.

"ఏం?"

"ఆ నాకొడుకులు తావు సాల్దంటాండ్రు."

"నిజంగా చాల్దా?"

"బిల్డింగులకు సరిపోద్ది. గొడ్డు గోదా కట్టేసుకోవాలంటేనే బరువు."

కొద్దిసేపు మౌనం తర్వాత చెప్పాను "నేను కనుక్కొంటాలే" అని.

ఏసేబు ఆగి మిరపచేల కేసి సాగాడు 'గొర్రె పిల్లలకు ఆముదపు ఆకు కావా'లంటూ.

వాస్తవానికి ఏసేబు మావూరి వాడు కాదు.

మా మాలోల్ల చుట్టం.

అతనిలాంటి వాళ్ళు పదిమంది దాకా వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. కూలి నాలి చేసుకొంటూ, విస్తారంగా వ్యాపించి ఉన్న బరక భూముల్లో కొర్రో, ఆరికో పండించుకొంటూ - బతుకుతున్నారు. నాలాటి పనిచేయలేని వాళ్ళ భూముల్ని కోరుకుగుత్తకు చేసికొంటున్నారు.

ఇప్పుడు బిల్డింగులొచ్చేసరికి వాళ్ళకు వూర్లో స్థలాలు తక్కువయ్యాయి. ఇంతదాకా తమ తావుల్లో గుడిసెలేసికోనిచ్చిన బంధువులు ఇప్పుడు లేచి పొమ్మంటున్నారు.

ఈ తకరార్ల మధ్య వచ్చిన బిల్డింగుల్ని వదిలేసుకొంటారేమోనని నా కొంత ఆందోళన కలిగింది.

వాళ్ళకు నా హయాంలోనే పక్కా గృహాలు కట్టించాననే తృప్తికన్నా, రాజకీయంగా వాళ్ళెప్పుడూ నా వైపే ఉండిపోతారనే నమ్మకం నాకెక్కువ ఆనందాన్ని కలిగిస్తూ ఉండేది.

అదిప్పుడు బీటలు వారటం పట్ల బాధగా ఉంది.

ఇంటికెళ్ళి ముఖం కడుక్కోని కడుపులో యింత పిడచ వేసికొని పంచలోకొచ్చే సరికి "ఒయ్ దొరా!" అంటూ వచ్చాడు గురన్న.

అతని వెనక పులిసుబ్బన్న - ఎంగన్న తిరిపేలయ్యలు ఉన్నారు.

అందరూ మంచాల మీద కూచున్న తర్వాత "ఇంతకూ మిద్దెలు ఖాయమేనా ఓహోయ్?"అని అడిగాడు గురన్న.

"ఆ...ఖాయమే" చెప్పాను.

"ఎన్ని?"

"నలభై దాకా"

"యిరవై యిండ్లోల్లే గదబ్బీ యీల్లంతా?" పులిసుబ్బన్న అడిగాడు ఆశ్చర్యంగా.

"పెద్ద కుటుంబాలున్నాయి గదా! ఏరుబొయ్యేవాల్లకు కావొద్దూ!" చెప్పాను.

"అవున్లే పుట్టిన పిల్లోడంతా యేరుబొయ్యేవోడే" ఎంగన్న అన్నాడు.

"మనమిప్పుడేమీ అనుకోవాల్సిన పన్లే. మన పూర్వీకులకు బుద్ధిలేదు." బీడి ముట్టించుకొంటూ అన్నాడు పులి సుబ్బన్న.

"ఏమీ?"

"బుద్ధున్నోల్లయితే మాలిండ్ల పక్కన వూరుగట్టుకొంటరా?"... గయ్‌మన్నాడు.

నాకు నవ్వొచ్చింది.

"ముందు మనోల్లే వూరుగట్టారేమో?" అన్నాను.

"అట్లయితే మాలోల్లను వూర్లో యిండ్లేసుకోనిస్తరా?" అన్నాడు కోపంగా.

నిజమే.

ప్రతివూరికి మాలవాడ దూరంగా ఉంటుంది.

మా వూర్లోనే కలిసి వుంది.

పూర్వం మా బరుగొడ్లకొట్టం హద్దుగా పడమటి వీధంతా మాలిండ్లేనట. నలభై ఇళ్ళదాకా వుండేవట. వాళ్ళంటే జంకుతూ ఉండే వారట వూర్లోని గొల్లలు, కాపులంతా.

గత అర్ధ శతాబ్దంలో ఇక్కడి కరువు పరిస్థితులకు తట్టుకోలేక భద్రావతి మొదలైన ప్రాంతాలకు వలసపోయారట మాలోల్లంతా.

వాళ్ళ యింటి స్థలాల్లో రెండొంతుల దాకా గొల్లలు కాపులు ఆక్రమించుకొని ఇండ్లేసుకొన్నారు.

ఇప్పుడు మాలిండ్లకు వూరికి అసలు తేడా లేకుండా పోయింది.

"యీన్నించి జూస్తే నీకేమనిపిస్సాందోయ్?" గురన్న అడిగాడు.

నేను పంచలోంచే మాలిండ్లకేసి చూపులెత్తాను.

ప్రతిరోజు అప్రయత్నంగా కొన్ని వందల సార్లు చూస్తుంటాను.

నాకేమీ అన్పించట్లేదు.

"ఆ గుడిసెలూ, ఆ కొట్టాలూ, ఆ పడిపోయిన గోడలూ...మాలోల్లకూ రైతులకూ ఏమన్నా వారా కనిపిస్సాందే?"

నిజమే. ఏమీ - తేడా లేదు.

"ఆ మాలిండ్లన్నీ మిద్దెలయినాయనుకో ఎట్టుండదో ఒకసారి వూహజేసి సెప్పు."

కొత్త చమత్కారమే.

'వెలిగే మాలిండ్ల మధ్య వెల వెలబోయే రైతుల గుడిసెలు' అంటూ చెప్పవలసి వస్తుంది.

"ఎప్పుడన్నా సరైన కాపోడు వూర్లోకొచ్చి సూస్చే మానం బోద్దోయ్ మొగోడా!"

అయోమయంగా అతనికేసి చూశాను.

అతని ఉద్దేశ్యమేమిటో నాకర్థం కాలేదు.

"వాల్లంతా మిద్దెల్లో. మనోల్లంతా బోదకొట్టాల్లో... పొద్దన్లేసి నాన్నుంచీ సూస్తావుండాలంటే బాగుండదబ్బీ!" తిరిపేలయ్య.

వాళ్ళ ఉద్దేశ్యం నాకర్థమైంది.

"బిల్డింగులు శాంక్షనయినయ్? మనమేం చెయ్యలేం" చెప్పాను.

"రాకుండా జయ్యొద్దు. వూర్లో కట్టకుండా జెయ్యిసాలు" ఎంగన్న.

"కొత్త మాలోల్లకు యీల్లెట్టా తావియ్యరుగదా! వాల్లను గాదని యీల్లు సొంతంగా కట్టుకోలేరు. అందర్నీ కలిసి పలుగురాళ్ళ మిట్టన కట్టుకోమని సెప్పు" గురన్న సలహా.

ఆలోచిస్తూ వుండిపోయాను.

* * * *

మధ్యాహ్నం దొడ్లో మందారం చెట్టుకింద వాలు కుర్చీలో కూచుని కళాపూర్ణోదయం చదువుతున్నాను.

కథ నడిపిన తీరు నన్నెంతో ముగ్ధుణ్ణి చేస్తోంది.

ఊహించని మలుపులు. మలుపు మలుపుకూ ఒళ్ళంతటికీ గగుర్పాటును అంటించే కుదుపులు.

పుస్తకాన్ని ఒళ్ళో పెట్టుకుని అందులోని దృశ్యాల్ని సజీవంగా మనోఫలకం మీద గీసికొనేందుకు ప్రయత్నిస్తూ కళ్ళు మూసికొని వెనక్కి వాలాను.

ఇంట్లో అమ్మ, ఇందిర మాట్లాడుకొనే మాటలు అస్పష్టంగా వచ్చి నా చెవుల సోకేందుకు ప్రయత్నిస్తున్నాయి.

వాటిని నేను పట్టించుకోదల్చలేదుగాని, పొట్టక్క గురించిన మాట విన్పించేసరికి ఆసక్తిగా చెవులు రిక్కించాను.

"వాని మొగంలే. పెసిడెంటు అయినాకె వాని బుద్ధులు గూడా మారిపోతాండయి" అమ్మ అంటోంది.

రాత్రి నేను చెప్పిన మాట ఆమె చెవినేసింది కాబోలు ఇందిర.

"ఆపొట్టదీ నేనూ సిన్నప్పట్నించీ సావాసగత్తెలం. ఇద్దరం కల్సి బరుగొడ్లకు పోతాంటిమి. అప్పుడు గూడా యింత లావు పొట్టేసుకొని తిరుగుతాండె. వాల్లమ్మ బెట్టిన సొగం ముద్ద సద్ది సంగటి దాని కడుపులో ఏమూలకూ సాల్దు. నా సంగటి గూడా గుంజక తింటాండె. నేనెప్పుడన్నా మాయమ్మ మీంద అలిగి సంగటి తీసప్పోకుంటే దాని సొగం ముద్దలోనే ఇద్దరం సర్దక పోతాంటిమి. ఆ రోజు యింగ దాని అగసాట్లు సూడాల. సేలల్లో అలసందకాయలు కందికాయలు పెరక్క తింటది. కంపసెట్లల్లో దూరి దోరదోర రేగ్గాయలు పీక్క తింటది. బచ్చుటాయి గడ్డలు తొవ్వక తింటది. ఇంటికొచ్చేదాకా ఏదోకటి తింటానే వుంటది."

చిన్నప్పుడు తెలిసో తెలియకో చేసిన పనుల్ని ఆమె గొప్పగా చెప్పుకోవటం నాకు సహించకుండా వుంది.

కోడలు - తనమేనగోడలే కాబట్టి సరిపోయింది గాని, ఎవరైనా పరాయి పిల్లయి వుంటే - మాలోల్ల సంగటి తిన్నందుకు ఆమెను ఎంతగా అసహ్యించుకొని వుండేదో!

"అది లేకుంటే యీడేడ వుండాడనీ! యీడు పుట్టడం ఆకలితోనే పుట్టిండు. బూమ్మీద పన్నేల ముంచీ ఒకటే ఏడుపు. నాకాడ పాల్లేవు. బరుగొడ్డు పాలువొంటలే. ఆడికీ ఆవును వట్టకొచ్చిండు మీవమామ. అయ్యీ కుదర్లే. ఇప్పుడేల అప్పుడేం పాలపొడి డబ్బాలున్నాయో? పాడా?.... ఆయమ్మను యీయమ్మను ఎన్రోజులని బంగపడాల. యీని ఏడుపు ఆపాలంటే నాసేతగాలే. ఆకాలానికి దేవతాల యిపొట్టదే అడ్డపడింది. వాల్ల పిల్లోనికి సంగటో సారకో పెట్టుకొని యీనికి పాలిచ్చింది... యీడు యింతోడయ్యేదాకా పొట్టక్కను సూస్చేసాలు ఎగురుకుంటా పొయ్యి వొల్లో పడేవోడు."

తర్వాత నాకు వినబుద్ధిగాలేదు.

ఏ విషయాన్ని గురించయితే నేను మధనడుతున్నానో దాన్నే ఆమె కెలికి కంపుజేస్తోంది.

రాజకీయంగా ఎదిగి, సంఘంలో గుర్తింపు పొందిన తర్వాత, ఆర్థికంగా అంతగొప్ప స్థితిలో లేకున్నా నా చదువును చూసో, పదవిని చూసో పదిమంది పెద్ద రెడ్ల సరసన నాకూ స్థానం కేటాయించిన తరువాత -

నా బాల్యం నన్ను వెంటాడే దయ్యమైంది.

నాకీ సమస్య చిన్నప్పటినుంచీ వుంది.

అప్పుడింత మేధోపరంగా ఉండేది కాదు.

గిరిలో ఉన్న బొంగరాన్ని గురిజూసి కాలెత్తి నా బొంగరంతో గుమ్మ గొడితే రెండుగా విచ్చి గిరికి అటు ఇటు చెక్కలయ్యేది. తోటిపిల్లలంతా సంతోషంతో చప్పట్లు కొట్టేవాళ్ళేగాని, బొంగరం పోగొట్టుకొన్న వాడు మాత్రం గుర్రుగా "యీడేం మనపాల్దాగిండా? మాలోల్ల పాల్దాగిందాన అంతబలం" అనేవాడు.

దాంతో పిల్లల చప్పట్ల మధ్య వాడి మీద నేను కలబడటం, ఇంటికొచ్చి మానాన్న చేత దెబ్బల్దినటం మామూలైంది.

బడిలో తోటి పిల్లల్ని కొట్టినప్పుడు సైతం ఇదేమాట.

ఒకసారి తోటకాడ మడవ కోసం గలభా జరిగి అవతల వాళ్ళు ఇద్దరూ కలసి ముల్లగర్రల్తో మానాన్న మీద దాడిజేసిన సమయంలో నేను ఒడుపుగా ఒకని చేతిలో కర్రలాక్కుని ఇద్దర్నీ చావబాదినప్పుడు వాళ్ళ ఆడాళ్ళ నోళ్ళల్లోంచి కూడా యివే మాటలు.

అమ్మసైతం అదేమాట 'పొట్టక్క పాలుతాగి పెరిగా'నని.

ఒక్కోసారి అన్పిస్తుంది నాకీ పెరుగుదల లేకున్నా బావుండేదని.

పైచదువుల కోసం వూరు విడిచింతర్వాత సమస్య చాలా వరకు మాసిపోయినట్లే అనిపించింది. ఊరి వాళ్ళతో మునుపటిలాగ గాఢంగా కలవకపోవటం వల్ల ఆ విషయం ఎదుటికి వచ్చేదే కాదు.

చదువైనాక ఉద్యోగానికి ప్రయత్నించటం ఆ ప్రయత్నాలు బెడిసికొట్టి అనుకోకుండా వచ్చిన పెళ్ళి ప్రయత్నం ఫలించటం, మేనమామ కూతురే నా పెళ్ళాం కావటం. నా నిరుద్యోగానికి కొంత పని కల్పించినట్లయింది.

నేను వూర్లో మొదటి గ్రాడ్యుయేట్‌ననే అహం వల్లనయితేనేం, ధనవంతుడైన మామ దొరికాడనే గర్వం వల్లనయితేనేం, కోరుకు గుత్తకు యిచ్చి కూచున్నా కుటుంబ పోషణకు ఇబ్బంది కలిగించని భూములున్నాయనే తృప్తి వల్లనయితేనేం – ఊర్లో మనుషుల్తో పెద్దగా పూసుకు తిరగను కాబట్టి ఆ మధ్య కాలంలో పొట్టక్క సమస్య నన్ను స్పృశించలేదు.

పొలం పనులు చేయలేక, ఇంటికాడ వూరకే వుండబుద్ధిగాక రాజకీయాల్లోకి దిగిం తర్వాత మనుషుల్తో కలిసిపోక తప్పలేదు.

అదో – అప్పుడు తిరగదోడడం మొదలైంది యీ సమస్య.

ఎన్నికలయ్యేదాకా వాళ్ళ ఎగతాళిని నేను చిరునవ్వుతో స్వీకరించేందుకే ప్రయత్నించానుగాని, పంచాయితీ ప్రెసిడెంటును అయిం తర్వాత భరించలేకపోతున్నాను.

అయితే వాళ్ళు కూడా నా చిన్నప్పటిలా సూటిగా గేలిచేయటం లేదుగాని, పొట్టక్క కనిపించినపుడు మాత్రం వరసైన వాళ్ళు చలిస్తున్నారు. నా హుందాతనాన్ని సైతం దాటుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

నోటితో అనకున్నా వాళ్ళ కళ్ళల్లోని పరిహాస కిరణాలు నా ఒళ్ళంతా గొంగలి పురుగులై ఉలులమంటాయి.

నా గెలుపు కోసం తన పరిధిలో అహర్నిశలూ శ్రమించిన పొట్టక్క కృషిని గుర్తుచేయటంలో కూడా వ్యంగ్యమే.

అందుకే యీ మధ్య కాలంలో ఆమెను చూస్తే చాలు – నిండా రొచ్చులో మునిగిన నా ఆకారం నాకు మదికొస్తుంది.

చిలుమెక్కిన వొళ్ళు, చింపిరితల, చిరుగుల చీరతో అసహ్యంగా ఉన్న ఆమె ఒడిలో నా బాల్యం గడవటం నాకు భరించరాని స్మృతిగా ఉంది.

చెమటతో తడిసి, ఉప్పుర్లి, చారికలు గట్టిన ఆమె రవికను చూడటంతోటే నా ఒళ్ళు జలదరిస్తుంది. నా ముఖం నిండా చెమట కంపు దట్టించినట్లుగా అన్పించి ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అవుతాను.

ఆమె నా కళ్ళ ముందు కన్పిస్తూ వుంటే నాకీ అగచాట్లు తప్పవు.

ఆలోచించసాగాను.

ఉదయం పులిసుబ్బన్న బృందం చేసిన ప్రతిపాదన గుర్తొచ్చింది.

ఆలోచించే కొద్దీ నా సమస్యకు పరిష్కారం అందులోనే దొరుకుతోన్నట్లుగా గోచరించింది.

అవును... ఆమె నాకు దూరమైతే చాలు.

మాలిండ్లన్నీ మిట్ట మీదకు మారితే ఆమె నీడకూడా ఇక్కడ సాగదు గదా!

హుషారుగా లేచి పుస్తకాన్ని గూట్లో పెడుతోంటే అమ్మ అంది "ఏమబ్బీ! గడ్డివామేయించవా? కల్లానికి కంపేయకుండా అట్టనే బెడ్తవా?" అని.

"రెండు మూడు రోజుల్లో అయిపిస్తాలే" చెబుతూ బైటకొచ్చాను.

మధ్యాహ్నం కాబట్టి పులిజూదం బారా కట్టలతో అరుగు మోగిపోతోంది. పులిజూదం వద్దనున్న పులిసుబ్బన్నకు పక్కకు పిల్చి విషయం చెప్పాను. ఆయన అటు వెళ్ళగానే నేను పులిజూదం వద్దకు నడిచాను.

* * * *

పొద్దుగూకే సమయాన పులిసుబ్బన్న నావద్దకొచ్చాడు గురన్నను వెంటేసుకొని.

"కుదరదంటాంద్రబ్బీ! మిట్టకు బొయ్యేందుకు కొత్త మాలోల్లు ఎప్పుడెప్పుడా అని సంకలు ఎగేస్చంద్రుగాని, పాతోల్లు వొప్పుకోడంలే. రైతుల్నిడ్సి పెద్దే మేమెట్టా బతకాల? అంటాంద్రు. 'ఉప్పో, పప్పో సద్ది సంగటో ఊరిమిండో అడక్కొచ్చుకొని బతికేటోల్లం. మేము సచ్చినా వూరిడ్సం అంటాంద్రు" చెప్పాడు.

నా ఆశలు తుస్సున జారాయి.

సమస్య మళ్ళీ జటిలమైంది.

పొట్టక్క బాధ నన్నొదిలేట్టు లేదు.

రాత్రి ఏసేబు అరుగు వద్దకొచ్చాడు.

"కుదరదంటాంద్రే వాల్లు. మీరే ఎట్టనోకట్ట బతిమాలుకోగూడదంద్రా" గురన్న చెప్పాడు.

"యినడం లేదయ్యా!" బాధ పడ్డాడు ఏసేబు. "తోటిమాలోల్లం, వూరిడ్సివొచ్చినోల్లం. రొవ్వొంతన్నా మా మీద కనికెరం లేదయ్యా నా కొడకలకు" అన్నాడు.

"వాల్లకు తెలిసి రాలేదుగాని – మిట్టమీద మీకు శానా సుగంగా వుంటదిరా!" – గురన్న అందుకొన్నాడు. "యీడ బారెడు బారెడు గుడిసెల్లో రొచ్చు బురదల్లో పొల్లేదే దానికన్నా మిట్టమీద కావలసినంత తావుంది. హాయిగా బతకొచ్చు. నెలరోజులు జడిబట్టినా కాలికి బురదంటదు. బస్సు మార్గం దగ్గెర. నన్నడుగుతే యిది నరకం అది సొర్గం రా!"

"నిజమేగదూమరి!" ఏసేబు తలూపాడు.

"అయ్యన్నీ ఎట్టన్నాయే రైతులిండ్లల్లో మాలోల్లం కలిసుండాలంటే యాడయిద్దెబ్బా? – యీల్లు బుద్ధిలేక వుండారుగాని. మీరు దోవన వస్చాంటరు. పోతాంటరు. మేం మంచాల మీద నీలుక్కొని కూకుంటే బాగుంటదే? అట్టని మాటి మాటికి లెయ్యాలంటే మా పొగుర్నా కొడుకలకు వొల్లంగుతదే? అందుకే మీకు దూరంగుంటే గౌరవముంటది. అయ్యా అన్నే, ఒరే అన్నే తగినట్టుంటది" చెప్పాడు ఏసేబు.

అతని మాట మా వాళ్ళందరికీ ఎంతో నచ్చినట్లుంది.

"ఆవ్ ఆవ్ – నీ నడతకు వాల్ల నడతకూ యాడ సమ్మందం. తొలీత నుంచీ సూస్చానే వుండాం, నీకతే యేరు. నీ తెలివి వాల్ల కేడ వస్చది" ఎంగన్న మెచ్చుకోలు.

"నేను పెద్ద రెడ్ల కాడ మెలిగినోన్నయ్యా! లోకం సూసినోన్ని. యీ నా కొడకలకేం దెల్సు" ఏసేబు వివరణ.

ఏసేబు మాటల్లోని నిజాన్ని గురించి నాకు అనుమానమే.

అక్కడి రెడ్లచేత దెబ్బల్దిని చెల్లకనే ఇక్కడికొచ్చాడని జనుల వాదుక.

తమకు స్థలాలివ్వని పాత మాలోల్ల మీద రైతులకు చెడు అభిప్రాయాన్ని కలిగించేందుకు అతను ప్రయత్నిస్తూ ఉన్నట్లుంది.

నేనేమీ కలుగజేసికో లేదు.

రాత్రి అమ్మకు చెప్పాను వామేసేందుకు ముగ్గురు కూలోల్లను పిలవమని.

ఉదయమే లేచి కూలోల్లను వెంటేసుకొని కళ్ళంలో కెళ్ళాను.

పొట్టక్క కొడుకుతోటి ఇద్దరు కాపోల్లు ఉన్నారు పనికొచ్చిన వాళ్ళలో. లావుపాటి గుండ్రాళ్ళ మీద పండెకొయ్యల్ని పేర్చి రెండు బండ్ల జొన్న చొప్ప వొడ్డేసరికి అంబలి పొద్దయింది.

పైటేలకంతా వామి బాగా ఎత్తుకు లేచింది.

మంచి హుషారు మీద పన్జేస్తున్నారు కూలీలు.

పొట్టక్క కొడుకు వామ్మీద వున్నాడు.

మనిషి బక్కగా టి.బి. పేషంట్‌లా ఉన్నా - వాడు మంచి ఏటుగాడు.

పొట్టక్క మీది స్మృతులకు తావివ్వకుండా కోపు యాస లేకుండా వామి పెరిగేందుకు కింద నుంచి సూచనలిస్తూ పన్జేయించుకొంటున్నాను.

వామి పెరిగేకొద్దీ దగ్గరున్న ఎండుగడ్డి అయిపోయి కుప్పలు దూరమయ్యాయి.

మోపుల్ని ఎగేసేందుకు కూడా బరువై చిలక్కట్టె ఉపయోగించాల్సి వచ్చింది.

మోపు గట్టటం, మోయటం ఇద్దరి చేతుల్నిండా పనవటంతో, తలకుగుడ్డ చుట్టి చిలక్కట్టె అందుకొని ఎగేయటం ప్రారంభించాను.

బరిగె, రాగి, కొఱ్ఱ, అరికె చెత్తల్తో బాటు,సెనక్కట్టె కూడా కలిపి పొరలు పొరలుగా పేరుకొని వామిగా రూపెత్తుతోంది.

ఎండ పొడ సోకకుండా ఉన్న చింతకొమ్మల నీడ కింత మేము హుషారుగా పన్జేస్తున్న సమయంలో సింగరప్ప వచ్చాడు ప్రకాశాన్ని తోడేసుకొని.

"నేనెగేస్చతీబ్బా!" అంటూ ప్రకాశం నా చేతిలోని చిలక్కట్టె అందుకొన్నాడు.

తలకు చుట్టుకొన్న టవాల్ విప్పి వొళ్ళు విదిల్చికొని, కడవలో నీళ్ళొంచుకు తాగి ఒకరాతి మీద కూచున్న నా వద్ద కొచ్చాడు సింగరప్ప.

"ఏంది కత?" నవ్వుతూ అడిగాను.

"ఏముంది సామీ! ఎట్టనోకట్ట ఆ మిద్దెలొచ్చేట్టు సూడు. బీద నాకొడకలం" దీనంగా అన్నాడు.

"మీకు బిల్డింగులు కట్టించాలనే నేనింత ప్రయత్నం చేసేదీ" చెప్పాను. "వాల్లకు మీరు తావియ్యక పోతిరి. వాల్లతోబాటు వూరిడ్సి మిట్టకుపోమంటిరి. మధ్యన నేనేం జెయ్యాల?"

నా ఎదురుగా గొంతుక్కూచున్నాడు అతను.

"మిమ్మల్నిడ్సి పెట్టి మేమేడ బతకాల? మిట్టమీంద యిండ్లేసుకొంటే మానాకొడుకులు పనికొస్చురా రెడ్డీ! అదిలిచ్చే వాల్లులేక - పనీబాటల్జెయ్యకుండా పెండ్లాల కూలిగింజల్తో సారాయి తాగి తాగి నాశినమై పోరూ! యీడ వూర్లో వుండబట్టీ, పొద్దన్లే సినాన్నుంచీ మీ మొగాలు సూడబట్టి కూటికి గుడ్డకు యిబ్బంది లేకుండాంగాని వూరిడిస్చే బతుకుతమా సోమీ! సుట్టు పక్కల మాల మాదిగోల్ల బతుకు సుస్చాండం గదా! అబ్బబ్బ - వూరిడ్సే మాట ఎత్తగాకు రెడ్డీ!" అన్నాడు.

తదేకంగా అతనికేసి చూశాను నేను.

నిజమే.. ఊర్లో ఉండటం గుండా చుట్టుపక్కల మాల మాదిగల్లాగా వీళ్ళు సోమరి పోతులయ్యేందుకు వీల్లేకపోయింది. వీళ్ళు గోడకింద కూచోబోయినా రైతులు కూచోనివ్వరు. రెక్కబట్టుకు పొలాల్లోకి లాక్కుపోతారు.

"మరి...కొత్త మాలోల్ల సంగతేందోయ్? వాల్లు మిమ్మల్నే నమ్ముకొన్నేరు గదా!" అన్నాను.

"వాల్లకూ మాకూ ఏమి లంకె రెడ్డే?"

నాకాశ్చర్యమేసింది.
"మీ వాళ్లేగదా!" అన్నాను.
గట్టిగా వూపిరి పీల్చి వదిలాడు సింగరప్ప.
"నా కొడుకులకేం? – యియ్యాల యీడుంటరు. రేపు యింగోసోటికి బోతరు. ఆ ఏసేబు గాడయితే యిప్పటికి రొండూర్లు మారిండు. రొండూర్ల కాడ వానికి గవన్మెంటోల్లు మిద్దెలు గట్టిచ్చిన్రు, బూమిలిచ్చిన్రు, బోర్లేయించిన్రు" గట్టిగా చెప్పాడు.
"అవన్నీ ఎక్కడి కెళ్ళాయ్?" వింతగా ఉంది నాకు.
"కడుపులోకి..." అభినయిస్తూ చెప్పాడు.
"అవ్ రెడ్డే! ఎద్దల్ను కోసక తిన్నెరు. బండ్లమ్ముకొన్నెరు. బోరులో మోటారమ్ముకొని లోపల పడిపోయిందని ఆఫీసర్లకు జెప్పిన్రు. వూరిడ్సినాంక మిద్దె దంతెలు, నాకిండ్లు గూడా పీకి అమ్ముకొన్నెరు. యీడ గూడ అదే పని బట్టాలని సూస్తాన్రు."
ఆ కఠోర సత్యం నన్ను కొంత సేపు కుదిపింది.
"వాడెప్పుడూ ఎవుని ఎంగిలిదిని బతుకుదామా అనే సోమీ!" సింగరప్ప అన్నాడు.
ఎంగిలి అనేసరికి నాకు వామ్మీది ఏటుగాడు గుర్తొచ్చాడు.
పుట్టగోచీ బెట్టి వామ్మీద హుషారుగా కదల్తున్నాడు.
ఒళ్ళంతా మట్టిపేరుకొని పుళ్ళ శరీరంతో, అస్థిపంజరంలా వున్న పొట్టక్క కొడుకును చూస్తోంటే – వాడి ఎంగిలి పాలుతాగి పెరిగాననే విషయం నా వెన్నెముక వెంట అసహ్యపు జలదరింపై పాకుతోంది.
రాజకీయపు హోదా, చదువిచ్చిన విజ్ఞానం, సంఘంలో గౌరవం అన్నీ కలిసి ఉచ్చ స్థితిలో ఉన్న నేను వాని దృష్టిలో ఎంతతక్కువ స్థాయిలో వుంటానో వూహించుకొనేసరికి అక్కడ నిలబడ బుద్ధిగాలేదు.
నా సమస్తదశలు ఎంగిలి అయినట్లు సిగ్గేస్తోంది.
సింగరప్పతో కలిసి ఊర్లోకి నడిచాను.
చీకటి పడేసరికి వామేసి ఎంట్లు గట్టి వచ్చారు కూలీలు.
రాత్రి ఏసేబు అరుగు వద్ద కలిశాడు.
సింగరప్ప ఆరోపణల గురించి ఆరా తీశాను.
"ఆవ్ రెడ్డీ! ఆ బూముల్లో తుమ్మ కట్టెల్లప్ప ఏమీ పెరగవు.పాపిస్టి సవుటి భూములు... మిద్దెలిచ్చిన్రు. తుమ్మ కట్టెలు గాల్చి బొగ్గులేసి అమ్ముకొని ఆ మిద్దెల్లో యింత గంజిగాసుకొని బతుకుతాంటిమి... అంతలోకి సవిటి బూములకు పట్టాలిచ్చిరి. బోర్లిచ్చిరి. ఎద్దులిచ్చిరి. బండ్లిచ్చిరి. దాంతో మేమూ రైతులమని సంకలు గుద్దుకొంటిమి. కట్టెలు గొట్టడం మాని బూములు సాగుజెయ్యబోతిమి. సవిట్లో ఏం బండుతాయ్? మొల్చిన మొలకంతా ఎఱ్ఱబడి సావబట్టె. బోర్లు, బండ్లు ఎద్దుల్జూపి అప్పులిచ్చిన మారాజులొచ్చి మెడల మీంద కూకుండ్రి. ఇంగేజెయ్యాల సామీ! ఎద్దలమ్మినం. బండ్లమ్మినం. బోర్లమ్మినం...ఆ వూర్లిడ్సినం..." చెప్పాడు.
"లెక్క శానా మిగిలిండాల్నే మరి?" ఎంగన్న ప్రశ్న.
"యాడుందెయ్యా? మాకెవురిస్చరు? ఎద్దులు బండి ఎరువుల బాకీకి సెల్లుబడె. ముప్పయేలమ్మే మోటారు దొంగదెనీ, అదెనీ ఒక పెద్దరెడ్డి ఐదేలు సేతబెట్టె. అది తిండి గింజలకూ, గుడ్డల బాకీకి సెల్లుబాయె. ఇంగ మిగిలిందేంది సోమీ?" అన్నాడు.

వాళ్ళ సమస్య ఏం జేసేందుకు నాకు అర్థం కాలేదు.
నలభై మిద్దెలూ వూర్లోకనే శాంక్షనయ్యాయి.
వీళ్ళిట్లే కొట్లాడ్తూ వుంటే కేన్సిలవుతాయి.
మిట్టమీద కొన్ని ఇక్కడ కొన్నిగా విడగొట్టాలంటే ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లక తప్పదు.
అందుకు రైతుల నించి వ్యతిరేకత ఎదురవుతోంది.
ఇంకొన్ని రోజులు గడిస్తే వాళ్ళే ఏదోకటి పరిష్కరించకోకపోరు.

*  *  *  *

మా వూరి మాలల స్థితిగతుల్ని గురించీ, వూర్లో వాళ్ళ స్థానాన్ని గురించీ, రైతులకూ వాళ్ళకూ మధ్యనున్న సంబంధాల్ని గురించీ – దళితుల జీవన విధానంపై అధ్యయనం చేస్తున్న – నా హైదరాబాదు మిత్రుడికి రాసిన లేఖకు సమాధానం వచ్చింది.
మంచి విశ్లేషణతో చక్కగా ఉంది ఉత్తరం.
మొదటి లైనులోనే రాశాడు. 'వాళ్ళెట్టి పరిస్థితిలోనూ వూరు విడవ'రని.
వాళ్ళు సాంఘికంగా సమానత్వం కోసం చూస్తున్నారట.
ఇప్పటికే ఊర్లో ముక్కాలు భాగం కాపులకు గొల్లలకు – వాళ్ళు మంచాలు దిగి – చూపే గౌరవం మాసిపోయింది కాబట్టి.'ఒరే తరే' అనే పిలుపుల్లో చాలా వరకు పేర్లు చోటు చేసికొన్నాయి కాబట్టి.
అందరి పిల్లలూ ఒకేచోట చదువుకోవటంతో వాళ్ళ మధ్య తిట్టుకోవడాలూ, కొట్టుకోవడాలూ, ఆటలూ, పిలుపులూ కులాలకతీతంగా జరుగుతున్నాయి కాబట్టి.
అన్నింటికంటె ముఖ్యమైంది.
'అవి మాలిండ్లని' వేలెత్తి చూపే అవకాశం లేదు గాబట్టీ
తమ పూజారులు, పౌరోహితులయిన బ్రాహ్మణులకు ఈనాటి రెడ్లు ఏమాత్రం గౌరవమిస్తున్నారో చూస్తున్నారు కాబట్టి.
తొందరలో తాము గ్రామంలోని మిగతా కులాల తోటి కలసిపోతామనే నమ్మకముంది గాబట్టి.
వాళ్ళు వూరు వదిలి మిట్టమీదకు వెళ్ళరని రాశాడు.
ఇందులో నిజమెన్ని పాళ్లో నేను తర్కించదల్చుకోలేదు గాని, నా సమస్యకు పరిష్కారాన్ని గురించి మథన పడుతున్నాను.
సింగరప్పను పిల్చి అడిగాను చివరగా "వూరు విడిచే ఆలోచనలు ఏమైనా వున్నాయా?" అని.
"మిట్టమీంద అయితేనే మిద్దెలొస్చాయనే మాత్తరమయితే మాకా మిద్దెలొద్దు. ఏమొద్దు. కొత్తమాలోల్లకే యియ్యండి. మిమ్మల్నిడ్సి మేం పోలేము" అన్నాడు.
నా సమస్య తిరిగి మొదటి కొచ్చింది.
పొట్టక్కను ఇంటికాడికి రానీకుండా వుండటమే తాత్కాలిక పరిష్కారంగా తోస్తోంది.
ఇందిరకు మళ్ళీ చెప్పాను.
అమ్మతో గట్టిగా మాట్లాడమని కూడా వేడుకొన్నాను.
మధ్యాహ్నాం దొడ్లోవున్న నా వద్దకు అమ్మ విసురుగా వచ్చింది, "ఎవురొరే నిన్ను ఎకతాలిజేసే నా బట్టలు?" అంటూ.

నేను బిత్తరపోయాను ఆమె తీవ్రత చూసి.

"మాల్దయితేనేం? అది మనిషిగాదూ! ఆర్చుకోని ఆర్చుకోని బరుగొడ్డు పాల్దాగుతరే. అంతకన్నా యీనమైందా అది? ఎవరో సెవల్దెగిన్నా బట్టలు యేందో అంటాండరని నువ్వు బాదపడ్తే ఎట్టా?" అంది.

"అదిగాదు మా..." వివరించబోయాను.

"కొడుకును కంటానే అమ్మయిద్దే? - పాలిచ్చి బతికిచ్చుకొంటే అమ్మయిద్దిగాని. ఆపొట్టదే లేకుంటే నేను అమ్మను గాదు. ఆడదాన్ని గూడా కాదొరే. నాకున్నె వొంకర దానిగుండా తీర్చుకొన్నె. నిన్ను బతికిచ్చుకొన్నే. అది నాపాలి దేవతరా!" అంటూ ఇంట్లోకెళ్ళింది.

ఏదో ఆవేశం పూనినట్లు రావటం, పోవటం.

పొట్టక్కను దూరం చేసేది లేదని ఖాయంగా సూచించటం.

ఆమె హృదయం నాకర్థమైంది.

నేను కాదనటం లేదు.

కాలాలు మారాయి గదా!

ఇప్పుడు జీవితాలకు మేధోపరమైన ప్రాధాన్యత ప్రధానమైంది. సున్నితమైన వ్యంగ్యాన్ని కూడా భరించలేని స్థితిలో ఉంది. అనవసర త్యాగాలకూ, జీవితాంతం ఋణపడి ఉండే బంధాలకూ మనస్సు కట్టుబడి వుండటం ఇప్పుడు అనాగరీకమైంది.

ఆమె చేసిన సహాయానికి అమ్మా నాన్నలు ధనరూపంలోనో, వస్తురూపంలోనో ఋణం చెల్లేసి ఉండొచ్చు కదా!

నేనిట్లా ఎంతకాలమని మానసిక క్షోభ అనుభవించాలి?

ఆలోచిస్తూ ఉండిపోయాను.

'అమ్మానాన్నలు చేయలేని పని నేనే చేస్తే?'

మెదడులో మొలకెత్తిన ఆలోచన క్రమంగా బలం పుంజుకోసాగింది. కొంత మూల్యం చెల్లించయినా పొట్టక్కను ఇంటివద్దకు రానీకుండా చేయాలనుకొన్నాను.

మూడు గంటల ప్రాంతంలో లేచి మా కళ్ళంలోకి వెళ్ళాను.

కంప అవతలే పొట్టక్క ఇల్లు.

ఈ సమయంలో ఆమె కొడుకు, కోడలు కూలిపనికి వెళ్లుంటరు. పిలుద్దామనుకొనే సరికి ఏవో మాటలు విన్పించి ఆగిపోయాను.

ఏవేవో పొద్దబోని కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్ళు.

అవతలి మనిషి వెళ్ళిపోతుందేమోనని నిరీక్షించసాగాను.

కొంతసేపటికి వాళ్ళ మాటల్లో విషయం మారింది.

నాకు ఆసక్తిగా అన్పించింది.

"యాడ జూపియ్యాలక్కా! ఏ డాకటేరు కాడికి పొయ్యినా సేటెడు సేటెడు మందులు రాయిస్తురు. వాటెకు లెక్కేడ దేవాల?" పొట్టక్కగొంతు.

"డాకటేరు కాడికెందుకూ? వానికేందో గాలిసోకింది. మూడు ఆదివారాలు అంకాలమ్మకాడికి తీసప్పో" అవతలి గొంతు సలహా.

"గాలి గాదు దూలిగాదులే. సిన్నప్పట్నించీ వాని బతుకంతే యాడాదిలోపల పిల్లోనెప్పుడే పాలియ్యకుండా ఎండగట్టి సంగటి బెట్టినా అప్పట్నుంచి పురెక్కలే".

"నీ కాడ పాలున్నెయేయోనే?"

'ఉన్నెయ్.. మా సెన్నమ్మ తల్లికాడ పాల్లేక, పిల్లోడు సావు బతుకుల్లో వుంటే.... ఆయనకిచ్చి సాకినా.

"ఎవరూ? మన పెసిలెంటుకేనా?" అవతలి గొంతులో ఆశ్చర్యం.

"ఆ..."

"నీ కొడుకును ఎండగట్టే?"

"ఆ... సెన్నమ్మా నేను సిన్నప్పట్నుంచీ పానానికి పానంగా వున్నేం. ఆమె కాడ పాల్లేక, పసరపు పాలొంటక, పాలిచ్చే వోల్లు దొరక్క పిల్లోడు ఆకల్తో గొంతు బూడిపోయేదాకా ఏడుస్పాండె. ఆమె మొగునికి ఏం జేసేదానికి దిక్కు దెలక ఆమెను గొనగబట్టె. నా కండ్ల ముందరే ఆమె సంసారానికి ముప్పొచ్చె. నా పిల్లోని పక్కా జూస్చి, పాల్లేకున్నే సంగడితిని పానాలు నిలబెట్టుకొనే కాదుండె. అందుకే... యీని ఎండగట్టి ఆయన్ను బతికిచ్చుకొన్నె".

నా కపాలంలో ఏదో పెఠీల్మని పగిలినట్లుగా అన్పించింది.

చింత చెట్టు మొదలుకి నేనో చింతమొద్దులా ఆనుకొని నిల్చుండిపోయాను.

నన్ను చూడగానే పొట్టక్క కళ్ళలోంచి జాలువారే అంతులేని వాత్సల్య ధార గుర్తుకొచ్చింది.

ఆమె కడుపుపట్ల మా అమ్మ చూపే ఆదరణ జ్ఞప్తికొచ్చింది.

నా ఉన్నతిపట్ల వాళ్ళిద్దరూ పడే ఆతృత మదికొచ్చింది.

ఆలోచించే కొద్దీ నాయీ హోదాకు, జ్ఞానానికి మూలాలు నేనకొంటోన్నవేమీ కావేమో అని కూడా అన్పిస్తోంది.

అప్పుడప్పుడూ అమ్మా నాన్నలు పశ్చాత్తాపపడుతున్నట్లుగా చెప్పే మాటల్ని బట్టి నేను పెరిగేందుకు ఆమె చనుబాలే కాకుండా వాళ్ళలోంచి మరేదో స్వీకరించినట్లుగా కూడా అర్థమవుతోంది.

మా నాన్న హయామంతా పొట్టక్క కుటుంబం మా యింటి మాలోల్లుగా రెక్కలు ముక్కలు చేసికోవటం.

నేను ఆరు చదివేందుకు నర్సాపురం ప్రయాణమైతే, నా తోటి ఐదు చదివిన పొట్టక్క కొడుకు మా యింట్లో బరుగొడ్ల కాపరిగా చేరటం.

నా చదువైపోయి ఇంటికొచ్చేదాకా మా నాన్నతో కలిసి వాడు అహర్నిశలూ మా పొలాల్లో శ్రమించటం.

అన్నీ గుర్తుకొచ్చేసరికి నా విజ్ఞానపు పరిధి కూడా తెలిసి వస్తోంది.

రైతుల్తోబాటు మాలోళ్ళకు కూడా బరకో, మెరకో కొంత భూమి ఉంది.

స్వల్పంగా వున్న వాళ్ల భూములు సాగుజేయబడకుండా రైతుల భూములే ఎందుకు పండించబడుతున్నాయో?...

నాలుగేళ్ళు కరువొచ్చేసరికి కేవలం మాలలే వూరిడిచి వలస పోవలసిన పరిస్థితి ఎందుకొచ్చిందో?

నాకిప్పుడు బాగా అర్థమవుతోంది.

చనుబాలు తాగినందుకే సిగ్గుబడుతోన్నవాణ్ణి వాళ్ళ జీవన మూలాల్లోంచి అస్తిత్వాన్ని పొందినందుకు నేనింక ఎంత ఖేదపడాలి!

చనుబాలకు ప్రతిఫలంగా ఆమెకు డబ్బునో వస్తువులనో ఇవ్వగలనుగాని -

వాళ్ళ శ్రమను చనుబాలుగా తాగి పెంచుకొన్న నా చదువుకూ, విజ్ఞానానికి, రాజకీయపు హోదాకు, ఆస్తులకూ ప్రతిఫలంగా ఆ కుటుంబానికి నేనేమివ్వగలను?

ఎగతాళి చేసేవాళ్ళకు యీ విషయం తెలిస్తే తమ వ్యంగ్యానికి యింత పెద్ద రాశుల్లో వస్తువు దొరికినందుకు ఎగిరి గంతేస్తారు కాబోలు.

అయినా నా అమాయకత్వంగానీ...

ఏ అగ్రకులస్థుడు మాత్రం వాళ్ళ చనుబాలు తాగకుండా ఇప్పుడుండే స్థాయికి ఎదిగాడనీ!

◆ *సాహిత్య నేత్రం ఏప్రిల్ - జూన్, **1996*** ◆